

# యుగసంధ్య

వి. శార్వరి

మానవుడు ఎప్పుడూ కొన్ని కట్టుబాట్లకూ, నీతి నియమాలకూ లోబడివుంటాడు. అవి దాదాపుగా సంఘం వ్యక్తిపైన బలవంతంగా రుద్దినవే అయివుంటాయి. సాధారణంగా అంతా సంఘ నియమాలకు, కట్టుబట్లకూ లోబడే వుంటారు. అలా కాక——

'నేను సంఘాన్ని ఎదిరిస్తాను. సంఘంతో, సంఘంలోని వ్యక్తులతో నాకు సంబంధం ఏ మాత్రం అవసరం లేదు" అంటాననుకోండి. సంఘం నన్ను వెలేస్తుంది మొదట. తరవాత నా ప్రశంసే ఎత్తదు. అప్పుడు నేను కటిక పేదనైతే నన్ను అణగదొక్కుతుంది సంఘం. కాక భాగ్యవంతుణ్నయితే ముభావంగా వూరుకుంటుంది. లేకపోతే నన్ను గొప్ప చేస్తుంది. నా డబ్బును చూసి నన్ను గొప్ప చేసిన సంఘం నేను ఏపని చేసినా ఆమోదిస్తుంది. నేను వ్యభిచరిస్తే సహిస్తుంది. నా పిల్లలకి వర్ణాంతర వివాహాలు చేస్తే అంగీకరిస్తుంది, మరేం చేసినా వూరుకుంటుంది.

* * *

సోఫాలో కూర్చుని తల్లీ కూతుళ్లు మాట్లాడుకుంటున్నారు. బ్లూలైటు వెలుగును గదినిండా చిమ్ముతోంది. కుర్చీలు, టేబిల్ ఇతర ఫర్నిచరు పాశ్చాత్య పద్ధతిలో అమర్చబడివుంది అందంగా. లుపులోనుంచి బయటకు పారిపోటానికి ప్రయత్నిస్తోంది నీలాకాంతి. కాని ప్రక్కనేవున్న క్రోటనులు, దూరంగా వున్న మెట్లు పోనీయటం లేదు. లోపల ఒక ప్రక్కగా మేడపైకి మెట్లు.

వాళ్ళ కంఠం అస్పష్టంగా వినిపిస్తోంది ప్రశాంత వాతావరణాన్ని చీల్చుకుంటూ. ఆకాశంలో వెన్నెల వెలుగుల్ని కప్పుకున్న తెగులా బీరంగు మేఘాలు కిటికీగుండా కనిపిస్తున్నాయ్. కొబ్బరి ఆకుల్ని చీల్చుకుంటూ వెన్నెల లోపల ప్రవేశిస్తోంది.

రాజమ్మకు కూతుళ్లంటే మహా ఇష్టం. అందుకు కొడుకులు లేకపోవటం కూడా ఒక కారణంగా చెప్పుకుంటే చెప్పుకోనూవచ్చు అనేకులు. ఒకవేళ కొడుకులున్నా కూతుళ్లకు ఆ పాటి ప్రత్యేకత యిచ్చేదేమో మరి ఎవరు చెప్పగలరు? కూతుళ్లంటే ప్రేమలేని తల్లులుంటారు గనుకనా లోకంలో!

మొత్తానికి రాజమ్మకు పుత్రసంతానం లేని మాట వాస్తవం. అయితే అదొక లోటుగా భావించదు ఆమె. ఆయిద్దర్నీ కూతుళ్ళనుకున్నా కొడుకులనుకున్నా. వాళ్ళే కొంచెంసేపు లాగులు వేసి, షర్టులు తొడిగి మగపిల్లల్లా కనిపించేవారు. అంతలో ఆడపిల్లలై చీరల్లో, రవికల్లో అగుపిస్తుంటారు.

రాజమ్మకు పిల్లలంటే మహా మోజు. తన కాలమంతా వాళ్నిముస్తాబు చేయటంలోనో,

సేవచేయటంలోనో వినిరోగిస్తుంది. ఆమెకు అదీగాక వేరుగా చేయవలసిన పనులు మాత్రం ఏ మున్నాయిగనుక!

ఆమె భర్త బ్రతికున్న రోజుల్లో - అంటే బాగా వయసులో వున్నప్పుడు-అసలు రాజమ్మ చిన్నతనం చరిత్ర తమాషాగా వుంటుంది.

రాజమ్మ అంతగా చదువుకున్న వ్యక్తిగాదు. అసలు చదువుకోవాలనే ఆశే వుండేదిగాదు మొదటనుండీ. పట్టి బలవంతాన పెద్దవాళ్ళు బడికి పంపితే సీతాపతిగాడితో తిరుగుతూండేది చదువు సంగతులు మాని తోటల వెంటబడి. సీతాపతయినా పరాయివాడు కాడు గనక సరిపోయింది. అయినా విచ్చలవిడిగా తిరగటం తప్పుగాదా అని తల్లి మందలించేది అప్పుడప్పుడు.

రాజమ్మ పెద్దదయింది. అయినా సీతాపతితో తిరగటంమానిందిగాదు. అంటే వెనకటిలా పొలాలవెంట, గట్లవెంట తిరక్కపోయినా, తోటలోమాత్రం తప్పక కలుసూనేవాళ్లు. అసలు రాజమ్మను బడికి మానిపించటం యిబ్బందయింది వాళ్ళకు. కలుసుకోటానికి ఆదోవంక పెట్టుకుని అనుకున్న సమయానికి తోటంలోకి చేరుకునేది నెమ్మదిగా, ఏదో పని వున్నట్టు. అతనూ అదే సమయానికి అక్కడికి చేరుకునేవాడు. ఇంకేం, గుసగుసలు, చెవులు కొరుక్కోటాలు. అట్టా రోజులు గడచిపోతూ వున్నయ్. కాలచక్రం కదలిపోతూనేవుంది ఒడిదుడుకులు లేకండా.

రాజమ్మకు పెళ్లి చేయా లనుకున్నారు తల్లిదండ్రులు. అనేక సంబంధాలుకూడా వచ్చినయ్. డబ్బున్నవాళ్లు, పొలాలున్నవాళ్లు, మేడలున్నవాళ్లు అన్ని రకాలవాళ్లూ అనేకమంది వచ్చేరు సంబంధానికి. కాని, ససేమిరా నే చేసుకోనని మొండికెత్తింది రాజమ్మ - గత్యంతరం లేక చాలాకాలందాకా పెళ్లి ప్రయత్నాలు ఆపారు తలిదండ్రులు. కాని రోజులు గడుస్తున్న కొద్దీ పిల్ల పైపడుతున్నయ్‌గాని తరగటం లేదుగా? అందులో కులంవాళ్లు ఏమన్నా అనుకుంటారేమోననే భయం ఒకవైపు, వుండివుండీ రాజమ్మ కొంప ముంచుతుందేమో నన్నభయం ఒకవైపు, ఇన్ని భయాలమధ్య ఆమె యిష్టం లేకండా ఒక సంబంధం స్థిరపర్చారు.

పెండ్లిరోజు దగ్గర కొస్తున్నకొలదీ ప్రయత్నాలు విరివిగా, చురుకుగా, కొనసాగింపబడుతున్నయ్. లగ్నంరోజు - విడిదివారు వచ్చి దిగారు. మంగళ స్నానాలకు ఏర్పాట్లు జరుగుతున్నయ్ ఒకప్రక్క—ఒకప్రక్క పెళ్లికూతురు కనిపించటం లేదంటే కనిపించటం లేదని వెతికారు ఇంటిల్లిపాదీ. మాయమైందంటే మాయమైందనుకుంటున్నారు. విచిత్రమంటే విచిత్రం-కానీ ఆరా తీయటం ఎవరికీ చేతకాలేదు. ఈ వార్త విడిదియింటి దగ్గర వూబారెవరో. అంతా గల్లంతుగా వెతకటం ప్రారంభించారు. బావులు, చెరువులు, తోపులు, పొలాలు ఎక్కడా కనిపించలేదు. పెండ్లికొచ్చిన పెద్దలు నానామాటలూ అని వెళ్లిపోయినారు లగ్నం వేళదాకా చూసి.

రాజమ్మ తలిదండ్రుల దుఃఖానికి అంతు లేదు. ఘోరుఘోరునయేడవడంసాగించారు. అసలు ఆపెండ్లి రాజమ్మకి యిష్టం లేదనీ, తామే బలవంతంగా తలపెట్టామని, ఈముదనష్టపు పెళ్లి మొదట అనుకోకపోయినా కూతురు దక్కేదనని, నిక్షేపంగా సీతాపతికిచ్చి వేస్తే, అటు దాని కోరికా తీరేదేననీ అనుకున్నారు.

సీతాపతి విషయం జ్ఞాపకం వచ్చేటప్పటికి రాజమ్మ దొరికినంత సంతోషం కలిగింది. అనుమానము కలిగింది. తీరా ఆరాతీస్తే అతను వూళ్లో కనిపించలేదు. పైగా యింట్లో పోట్లాడి రెండువేల రూపాయలు తీసుకుని చెప్పకండా పారిపోయాడని కూడా తెలిసింది. ఇంకేం యిద్దరూ కూడబలుక్కునే యింతపనీచేసి వుంటారని పెద్దల తీర్మానం.

రాజమ్మ తెలివైంది గనక ఆ పట్టుపట్టున పట్నం చేరుకుంది సీతాపతితో సహా. ఓ పెద్ద మేడ అద్దెకు తీసుకుని కాపురం పెట్టించింది. ఓ గొప్ప ప్లీడరు సలహాప్రకారం సీతాపతి తండ్రి మీద దావా వేయించింది భాగంకోసం. మూడో నెలకల్లా భాగం దొరికింది. ఎట్టాగో తన మైనారిటీ కాస్తా వెళ్ళబుచ్చి తల్లిపేర వున్న నూటయాభై ఎకరాలకూ ఎసరుతెచ్చి సంపాదించుకుంది నిక్షేప లాంటి శేరీ మాగాణిని. ఈ లోపుగా సీతాపతిగారి దూరపు నాసురాలెవరో వచ్చి మరో ఇరవై వేల ఆస్తి చూపించింది.

వీటన్నిటితో సీతాపతి, రాజమ్మల అదృష్టం ఫక్కుమని నవ్వింది.

సీతాపతి చనిపోయేనాటికి రాజమ్మకు యిద్దరు పిల్లలు. కూతుళ్ళంటే గారాబం గనక, చాలాకాలం వరకూ బడికి పంపకుండా ప్రైవేటుగా చదువు చెప్పిస్తూవచ్చింది. కాని హైస్కూలు చదువులు, పెద్దచదువులూయె మరి, బడికి పంపక తప్పిందిగాదు.

పెద్దకూతురు సరోజని కాలేజీలో చదువుతోంది యిప్పుడు. రెండోకూతురు యింకా చిన్నదే. పదేళ్లుంటాయి. రాజమ్మ తన పూర్వ చరిత్రను కథలాగా చెపుతూంటుంది కూతుళ్ళకు. ఎప్పటికప్పుడు ఆ కథ రుచిగా, హాయిగా వుండేది వింటానికి. అది చెప్పటంలో నేర్పుగానీ, కథలోని బిగువుగానీ వాళ్ళను బాగా ఆకర్షించేది.

ఇప్పటికీ రాజమ్మ ఆయింట్లోనే వుంటూ వుంది కూతుళ్ళతో సహా. భర్త బ్రతికున్న రోజుల్లోనే మంచి పలుకుబడి సంపాదించుకుంది గనక, ఆయనగారు పోయినా నిలబడగలిగింది పదిమందిలో గౌరవంగా. నిజంగా చూస్తే ఎవరితోటీ సంబంధము వుండనవసరం లేదు ఆమెకు. చేతినిండా సొమ్ము, ధనం- డబ్బుతో కొనలేని సుఖాలు లేవు గనక ప్రపంచంలో ఆమెకు లోటేమీ వుండేదిగాదు యితరుల సహాయం, సలహా లేకపోయినప్పటికీ. కాని రాజమ్మ వూరుకుంటేగా! భర్తకాలంనుంచీ వస్తున్న స్నేహితులను, అటు భర్తకు సంబంధించిన వారినీ, ఇటు తనకు సంబంధించిన వారినీ పోకుండా పట్టుకు వస్తోంది.

రాజమ్మగారిది డబ్బు గల కుటుంబం అని అందరికీ తెలుసు. అంటే స్నేహితులు అధికంగా వస్తూ పోతూవుండే సంసారమన్నమాట. పైగా ఆమెకూతుళ్ళు చదవటం యింగ్లీషు. స్నేహితులకేంతక్కువ. పిలిస్తే పలుకుతారు. అటు ఆడపిల్లలు, యిటు మగపిల్లలూ, స్నేహితులు సరోజానికి.

రాజమ్మగారు కూతురుతో మాట్లాడుతున్న విషయం కొంత రహస్యం. ఆమెకది రహస్యం కాకపోయినా-అసలు ఆమెకు ఆమె సంసారానికి దాచుకోదగ్గ రహస్యాలంటూ ఏమీ లేవు. చూచేవారికిమాత్రం రహస్యంగా కనిపిస్తుంది. కాని అవి కుటుంబానికి సంబంధించిన కొన్ని మామూలు సమస్యలు. వాటినే రహస్యాలుగా వాడుకుంటారు చాలామంది సామాన్యంగా.

రాజమ్మ సంఘాన్ని గురించీ, నీతిని గురించీ బాగా తెలుసుకున్న వ్యక్తి. సంఘంలో నీతి పేర జరుగుతున్న మోసం, అవినీతి,కుళ్ళు అంటే ఆమెకు తగని చీదర. ఆమె పూర్తిసంస్కార వాది మాత్రం కాకపోయినా, బూజుపట్టిన, సనాతన ఆచారాలంటే అసహ్యం: అన్నిటికన్నా ముఖ్యంగా డబ్బుకున్న విలువ ఎక్కువ తెలుసుకుంది. దాంతో చేయలేని పనంటూ లేదు ఆమెకు. అందుకనే కూతుళ్ళనూ తనలాగానే పెంచుతుంది. వాళ్ళు కోరినవాటికి అభ్యంతరం చెప్పదు. తనకిష్టమైనంత మాత్రాన వాళ్ళను అనుసరించమని బలవంత పెట్టదు.

కూతురు పెండ్లివిషయమై ప్రస్తావన. పైగా రాజమ్మ అడిగిన విషయాలకు సరోజిని సరిగ్గా సమాధానం యివ్వలేదు. పైపెచ్చు రాజుతో స్నేహం కొంతవరకూ తగ్గించుకోమని రాజమ్మ సలహా. అందుకు సరోజినికి కోపంవచ్చింది.

* * *

ఎవరో వస్తున్న అలికిడి-సవ్వడినిబట్టి రాజేమోనని యిద్దరూ గ్రహించారు. రాజమ్మ ఆ ప్రస్తావన ఆపింది. లోపల్లోపల ఆలోచించుకుంటోంది. ఇలాంటి స్నేహితులే చివరికి మోసం చేసేవని ఆమె వూహ. సరోజిని రాజుతో కలసి మేడపైకి వెళ్ళిపోయింది.

రాజుది మొదట ఓ పల్లెటూరు. అతను తలిదండ్రుల్నికూడా ఎరగడు పాపం. రాజు రెండేళ్ళ కుర్రాడుగా వున్నప్పుడే తల్లి చనిపోయింది. భార్యపోయిన దిగులుతో అతని తండ్రికి పిచ్చెత్తిందనీ, ఆతరవాత సన్యాసుల్లో కలిసిపోయాడనీ, అదిజరిగి యిప్పటికి పదిహేడు పద్దెనిమిదేళ్లు అవుతుందనీ వినికిడి. పోతే రాజును పెంచింది దగ్గిర బంధువుగా వున్న ముసలావిడ ఒకతె. ప్రస్తుతం రాజుపట్నంలో చదువుకొంటున్నాడు. తండ్రికి సంబంధించిన ఆస్తి తాలూకు డబ్బును తెచ్చుకుని కాలం గడుపుతూంటాడు. అతన్ని పెంచిన ముసలమ్మ అతను పుట్టిన వూళ్ళోనే యింటిని కనిపెట్టుకుని వుంటోంది యిప్పటికీ.

రాజుది మంచి విగ్రహం. ప్లాటుఫారం మీద ఉపన్యాసం చెప్పగల ధైర్యం కూడా వుంది. అందులో క్లాసు మొత్తంలోకీ తెలివిగల వాడని ప్రసిద్ధి. చక్కగా నాటకాల్లో వేషంవేయగలడు కూడాను. ఇన్ని సుగుణాలు వుండీ ఏ కోశానా దురభ్యాసాలు, చెడుతిరుగుళ్ళు ఎరగడు కనకనే సరోజిని అతని స్నేహాన్ని వాంఛించింది. రాజు భోజనం హోటల్లోనన్న మాటేగాని వుండటం రాజమ్మగారింట్లోనే, అదీకాక సరోజినితోటి విద్యార్థి. ఒకే తరగతి

సరోజినికి అప్పుడప్పుడు అతనిమీద మమకారం పుట్టుకొస్తుంది. కాని ధైర్యం చేసేది గాదు. తనని పెండ్లిచేసుకోమని అడుగుదామనుకుంది. అసలు తనంటే యిష్టముందో లేదో నని భయం. ఏరోజు కారోజు అతన్ని అడగాలనుకుంటుంది. కాని ధైర్యం చేసేది గాదు. తనతల్లితో మనసులోని మాట విప్పి చెప్పుదామనుకుంటే సిగ్గుదొంతరలు ఆమెను ముంచేవి. తను చేయబోయే పనిలో, వూహల్లో ఏమీ పొరపాటు పడటం లేదనే ఆమె నమ్మకం. అయినా ప్రేమించింది. పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది, ఏం తప్పు? అతని యిష్టం కూడా అవసరమే కొంత. అయినా మగవాడికి ఎంతలోకి వస్తుంది ప్రేమ. అసలు మగవారికి ఏదైనా తొందరే !

రాజు అందమైనవాడు-తను అందాన్ని చూసి ప్రేమిస్తోందా? అయితే అతనికంటే అందమైన వాళ్ళు ఎంతోమంది తనని కోరారు! ధనమా? అతనికన్న తనకే ఎక్కువవుంది. చదువా? ఇద్దరూ ఒకే తరగతి. మరి అతను తనకంటే ఎట్లా ఎక్కువైనట్లు? అన్నింటిలోనూ గొప్పగానే కనిపించేది తన మట్టుకు తనకి; అందువల్లనే అతని మీద మాటపడ్డా, నింద పడ్డా తను అంతగా బాధపట్టానికి కారణం.

* * *

పొద్దుపోయింది. రాజమ్మ ఒక్కర్తే బ్లాలైటుక్రింద కూర్చుని ఎదురు చూస్తోంది ఎవరి కొరకో! ఎంత సేపటికీ ఎవరూ వస్తున్న చప్పుడు లేదు. ఒంటరిగా ఎంతసేపని కూర్చుంటుంది! పైగా గడియారం పదకొండు గంటలు చూపుతోంది. నిద్ర రాకపోయినా మత్తుగావుంది. పిల్లలు చదువుకొనేందుకు మేడపైకి వెళ్లేరు. తాను ఒంటరిగా క్రింద అంతస్తులో నీలం వెలుగులో కూర్చుని ఆలోచిస్తోంది. దూరంగా బయట వెన్నెల కురుస్తోంది.

తలుపు గడియ వేసి పడుకుందామని ప్రయత్నం. గడప దగ్గరకు వెళ్ళింది. కొంచెంసేపు నిలబడి బజారులోకి చూస్తే, సైకిల్ వస్తున్న చప్పుడు. మరి కొంచెం సేపటికల్లా వాకిట్లో ఆగింది. ఆ వచ్చినవ్యక్తి లోపలికి సైకిల్ చేరుస్తో—

'ఏం రాజా ! అలా వున్నావేం ?' అన్నాడు ఆప్యాయంగా.

రాజమ్మ ఏమీ మాట్లాడలేదు. బయటితలుపు గడియవేసి వచ్చింది లోపలికి.

ఆమె వాలకం చూసి తిరిగి ప్రశ్నించాడు. 'ఏం చెప్పవ్! అలావున్నావేఁ! చెప్పు?' అంటూ ఆమె కూర్చునివున్న సోఫాలోకి వచ్చి కూచుని లాలనగా అడిగాడు. రాజమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. అతని కళ్ళల్లోకి చూస్తూ 'ఏం లేదు డాక్టర్' అన్నది. డాక్టరు కొంచెంసేపు మాట్లాడించకుండా స్థిమితంగా వుండనిచ్చాడు.

డాక్టరు రాజమ్మ సంసారానికి డాక్టరుగానే పరిచయమైనాడు మొదట. అది ఆమె భర్త వున్నప్పుడే భర్తకు జబ్బుగా వున్నప్పుడే మందు వాడటం ప్రారంభించాడు. రాజమ్మ భర్తను శతవిధాలా బ్రతికించాలనే చూశాడతను. కాని అతనికి ఆయుర్దాయం లేకపోతే తనేం చేస్తాడు. తనేం ప్రాణం పోయగలడు గనకనా ?

రాజమ్మ భర్త చనిపోయిన నాటినుండీ డాక్టరు ఓకంట ఆమెను కనిపెడుతూన్నాడు. ఆమె నెదుర్కొనే కష్ట సుఖాల్లో భాగం పంచుకునేందుకు ప్రయత్నిస్తూంటాడు. ఆమెకు కూడా చెప్పుకోదగ్గ బంధువులు, తనవైపువాళ్లు గాని, భర్తవైపువాళ్లుగాని లేకపోబట్టి పైకి రావాల్సిన పిల్లలున్నారుగనుక ఆయనగారి సలహాలు పాటిస్తువచ్చింది చాలా కాలంనుంచీ.

ఇప్పటికీ అంతే. ఆయన డాక్టరుగారు గనుక, పగలు తీరిక వుండదుగనుక రాత్రిళ్లు మాత్రమే వస్తూ పోతుంటాడు రోజూ. అయితే ఆమెదగ్గర అంత చనువు తీసుకోవటమనేది వేరే విషయం. అది ఆమె మంచితనంమీదా, ఆయన తీసుకునే చనువు ఆకర్షణమీదా ఆధారపడి వుంటుంది.

ముత్తానికి డాక్టరుగారు రాజమ్మ యింటి మనిషి క్రిందనే జమ. ఈ విషయం పిల్లలకూ తెలియకపోలేదు. పెద్దవారి విషయాల్లో పిల్లలు జోక్యం కలిగించుకోటం అంత ఆరోగ్యకరమైన విషయం కాకపోవడంవల్ల వారి విషయాల్లో జోక్యం కలిగించుకోక, వాళ్ళపనేదో వాళ్లు చూసుకుంటుంటారు మేడపైన.

డాక్టరుగారు చాలాసేపు వుండి వెళ్లిపోయారు బైటికి. రాజమ్మగారు ఒక్కతే తిరిగి తలుపు గడియవేసుకుని పండుకుంది సంతృప్తిగా. పన్నెండు గంటలయింది. ఆమె మనస్సు మనస్సులో లేదు. అనేక విషయాలను గురించి ఆలోచన. ముఖ్యంగా వాళ్ళనుగురించి. ఇన్నేళ్లు వచ్చినా తనే అంతగా వాంఛపడుతూంటుందే, వయస్సులోవున్న కూతురు ఎంత బాధపడుతూందోనని ఆమె బాధ. తనేం వాళ్ళకట్లు కప్పటం లేదు. తనెట్లు ప్రవర్తిస్తున్నదీ అందరికీ తెలుసు. తనను చూసి పిల్లలు చెడిపోతారేమోనని ఆమె భయం. ఏదో వాళ్లనయినా ఒక యింటివాళ్లను చేద్దామని ఆశ. కాని ఎక్కడా అంది రావటం లేదు సంబంధాలు. తను తలుచుకొంటే చాలా సంబంధాలు కొనగలదు. కాని ఈడూజోడూ, యిష్టాయిష్టాలు, పిల్లలకి నచ్చుటాలో?

రాజమ్మ మేడపైకి వెళ్ళింది. లైటు వెలుగుతూనేవుంది. సోఫాలో కూర్చుని రాజు చదువుకుంటున్నాడు. ప్రక్కగా మంచంపైనరోజిని-పుస్తకం గుండెల కానించుకుని నిద్రపోతూంది నిశ్చింతగా. మెత్తని గిరజాలు మంచంమీద చిందరవందరగా పడి వెలుగుతున్న లైటుకేసి చూస్తున్నాయ్. సుశీల అవతలగా బెడ్ మీద పండుకుని నిద్రపోతోంది. రాజమ్మ రావటం అతను గుర్తించలేదు ఏదో సీరియస్‌గా చదువుకుంటూ.

రాజమ్మకు ఏం మాట్లాడాలో తోచలేదు. ఎలాపలకరించాలో కూడా అర్థం కావటంలేదు. ఇంత అర్థరాత్రివేళ ఒంటరిగా వున్నప్పుడు పలకరించక పోతే ఏమనుకుంటాడో? తనను అనుమానించడు గదా? ఛీ! అన్నీ పాడువూహాలు, ఏమిటి తనకీ విపరీతం! అనవసరంగా ఆ అబ్బాయిని అనుమానించటం - తన మెతకదనాన్ని భావించుకోటం. రాజమ్మకు సిగ్గేసింది. తిరిగి వెళ్ళిపోతోంది తొందరగా.

రాజమ్మ కాళ్ళ తొందర రాజుని మైకంలోంచి జాగృతిలోకి తీసుకొచ్చినయ్. చూచాడు. రాజమ్మగారు! అతను నమ్మలేక కళ్ళు నులుముకు చూచాడు. నిజంగారాజమ్మగారేనా! అయితే ఎందుకొచ్చింది? అసలు వచ్చి ఎంత సేపయిందో. ఎప్పుడూ తను పైన వుండగా రాలేదు పైకి. అతనిలో ఆత్రుత ఎక్కువైంది. తొణికిసలాడే కంఠంతో—

'ఎవరూ? రాజమ్మగారా?'

వెనుతిరిగి చూచింది రాజమ్మ.

'మీరేనా! ఎవరోనని చూస్తున్నాను లెండి!' అన్నాడు.

'అవును నేనే!' అన్నది ఆగి.

'ఏదోపనిమీద వచ్చినట్టున్నారు? అమ్మాయిని లేపమంటారా?' ఎంత చనువు అమ్మాయి మీద అతనికి!

'అవసరంలేదు నాయనా!' అని అట్టాగే నిలబడివుంది.

'అలాగే నిలబడి వున్నారే. రాండి కూచుందురుగాని.' రాజమ్మ దగ్గరకు వచ్చింది. తీక్షణంగా చూస్తోంది, సిగ్గుతెరల్ని తొలగించుకుంటూ.

'ఏమండీ అలావున్నారూ ?'

'లేదు నాయనా—' తడబడుతూ- 'చదువుకుంటున్నావ్- చెడగొట్టటం లేదు గదా నే నొచ్చి!'

'ఆ! ఫరవాలేదులెండి!' అన్నాడు రాజు.

'ఓ పదినిమిషాలు క్రిందికి రా—'

'రమ్మంటారా, యిప్పుడు !'

'ఊ, కొంచెం మాట్లాడాలి.'

'సరే పదండి వస్తున్నా!'

ఇద్దరూ మేడదిగారు. సోఫాలలో ఎదురెదురుగా కూర్చుని వున్నారు. ఎవరు ఎవరిని ముందు పలకరించాలో ఎవరికీ తెలియటం లేదు. మాట్లాడాలని తీసుకొచ్చిందేగాని ఏం మాట్లాడాలో అర్థంగావటంలేదు, పాపం రాజమ్మకు. రాజు అలాగే కూర్చునివున్నాడు ఆమె పెదిమల వైపు చూస్తూ-ఎప్పుడు ఏం అడుగుతుందో నన్న ఆత్రుతతో.

'రాజూ!'

రాజు వులిక్కిపడి చూశాడు ఆమెవైపు.

ఆమె తల వొంచుకునేవుంది యింకా.

'ఏమండీ!'

'ఓ పెద్దవిషయం నాయనా, బాగా ఆలోచించి చెప్పు.'

'అలాగే, అడగండి.'

'అంతేగాదు, జీవితాంతం వరకూ సంబంధించి వుండే సమస్య. ముందు వెనుకలు బాగాఆలోచించాలి. చూశావూ?'

జీవితాంతం ఆలోచించవలసిన విషయాలు గానీ, ఆ సంబంధమైన సమస్యలుగాని అతని కేమీ లేవు నిజానికి. తల్లీ, దండ్రీ, దైవం ఎవరూ లేరు బాధించేందుకు. ఒంటరిగాడు. అదే రాజుకీ అనుమానం. ఏమిటి రాజమ్మ అడగబోయేది? తన జీవితాంతానికి సంబంధించిన విషయాలేమిటి? అతని మనస్సు బాధిస్తోంది ఈ విషయం.

'ఏమిటి చెప్పండి,—చెపుతాను' అన్నాడు.

'ఇదేం కొత్తవిషయ మేంగాదు రాజూ, నీకూ తెలిసిందే.'

దీంతో రాజు మరీ తికమకలో పడ్డాడు, ఏమిటో తనకీ తెలుసట! మరీ ఆశ్చర్యం.

'నాకేం అర్థంగావటం లేదు మీరనేమాటలు. చెప్పండి. ఏమిటి?' "ఏముంది రాజూ - జీవితం అన్నాక అచ్చట్లు - అందులో ఆడవారి సంగతి అడిగే దేముంది చెప్పు. నేనూ పెద్దదాన్నయి పోతున్నాను. అయినా కాకపోయినా ఏ యీడప్పుడు ఆ ముచ్చట్లు జరిగితేనే బావుంటుంది, ఏమంటావు?"

ఆమె మాటల ధోరణినిబట్టి చూస్తే షష్టిపూర్తి మహోత్సవం చేయించ మంటుందా అనిపిస్తోంది. కాని తనకి సంబంధించిన విషయంట పైగా.

'ఏమిటో తేల్చి చెప్పండి బావుంటుంది — తొందరగా' అన్నాడు.

'సరోజిని విషయమే రాజూ - యీడొచ్చిన పిల్ల, అచ్చటా ముచ్చటా అన్నారు. ఏమంటావు? అదే నేననేదిన్నూ!'

రాజు నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డది పాపం. తల్లో చేయిదూర్చి ఆలోచిస్తూ కూచున్నాడు. అతని తీవ్రతని రాజమ్మ ఏమీ అనలేదు. ఆలోచించుకోనిస్తోంది.

రాజమ్మకు తెలుసు రాజు యిప్పుడు పెండ్లి ప్రస్తాపన రానీయడని. పైగా ఈమధ్యవచ్చిన రెండు మూడు సంబంధాల్ని తిరగగొట్టాడు. 'నా కవసరం లేదు, నేను వెతుకవలసిన పని లేదు, అయినవాళ్లున్నారని. ఆ వచ్చినవాళ్లకు తెలుసు, రాజుకి అయిన సంబంధాలు లేవని. అయితే రాజమ్మతో చెప్పిపోయినారు వచ్చినవారు. అసలు రాజుకు చదువు పూర్తయిందాకా పెండ్లి చేసుకోటం యిష్టంలేదు. ఆసంగతి అంద రెరిగిందే. కాని రాజమ్మకు ఎందుకో అలా అడగాలని బుద్ధి పుట్టింది.

దాంతో రాజు ఎటూ చెప్పలేకపోతున్నాడు. అదీకాక తన కులమేమిటో, గోత్ర మేమిటో వారికి తెలియనివ్వలేదు యింత కాలంనుండీ. రాజమ్మగారు ఎవరో తనకి తెలుసు. కాని తనెవరో వారికి తెలియదు. తెలియనిస్తేగా! పాపం రాజమ్మగారు భ్రమిస్తున్నారు గావును అనుకున్నాడు. ఎంత మోసం, ఎంత మోసం! తను ఆ విషయం యింత కాలంనుండి దాచబట్టేగదా, రాజమ్మగారు మోసపోవటం, ఎంత మోసం చేతనో తనకు తనే వూహించుకోలేక పోతున్నాడు, తెగించి చెప్పాడు.

'క్షమించండి...నాతో సంబంధం...'

రాజమ్మ గ్రహించింది అతని వుద్దేశం, అతను అనుకునేలాంటి సందేహాలు ఆమెకు లేవు. అసలా పట్టింపులే లేవు. అందుకనే—

'మరేం ఫరవాలేదు నాయనా, అలాంటి భేదాలు పోయి ఎంతకాలమో అయింది' అని కళ్లతో నవ్వింది.

రాజుకు యిక రెండో దిగులు పట్టుకుంది. కులం పట్టింపు లేకపోయినా పిల్ల పట్టింపో? సరోజిని తనను ప్రేమిస్తోందా? పెళ్లి చేసుకుంటుందా? నమ్మకం లేదు. వాళ్లకుగల తాహతుకు తన తాహతుకు ఏమిటో సాపత్యం. సరోజ గొప్ప సంస్కార హృదయం. చదువుకుంది. తనకంటే గొప్పవాణ్ణి చేసుకోడానికి అర్హురాలు. తనను చేసుకుంటుందనే నమ్మకం అతనికి ఏ కోశానా లేదు.

రాజమ్మవైపు తిరిగాడు. ఆమె తన వంకే చూస్తోంది ఆ క్షణం.

"ఏమండీ, మీరు పొరపాటు పడటం లేదు గదా?" అని అన్నాడు.

'అదేమిటి రాజూ?'

'నన్నూ, నా తాహతూ, శక్తీ తెలుసుకునే అడుగుతున్నారా?'

'అవసరం లేదు, తెలియనవసరం లేదు రాజూ!'

'మరి?'

'ఏం మరి! నీవు మావాడివి. నీకేమున్నా లేక పోయినా నిమిత్తం లేదు. ఈవున్నది చాలకపో చెప్పు. మనలాంటివాళ్ళు మరో పందమంది బ్రతకొచ్చు. ఏంతక్కువ.'

'మరి తక్కువని గాదు—నా స్థిమితం ఆలోచిస్తున్నా.'

'నీస్థిమితం ఏమిటి? స్థితి ఏమిటి—చెప్పు-యిదంతా ఉంది కదూ?'

రాజమ్మగారిది యింత విశాలమయిన హృదయమని అతనింతకు ముందెప్పుడూ అనుకోలేదు. ఆమెలో సనాతన సిద్ధాంతాలకు తావు లేకపోయినా, యింత సంస్కృతి వున్నదని అనుకోరు ఎవరూనూ. అవున్న ఆస్తికి, డబ్బుకూ, ఎంతగర్వం, హోదా, ఠీవి వుండాల్సింది. కాని రాజమ్మలో అవేవీ మచ్చుకి కూడా దొరకవ్.

రాజు ఆమెగారిని బాగా అర్థంచేసుకున్నా తరవాత ఏమీ మాట్లాడలేక పోయినాడు. ఆమెకు ఎదురుచెప్పటం అతనివల్లగాలేదు. అందువల్ల హృదయపూర్వకంగా 'సరే, కానివ్వండి' అన్నాడు.

రాజమ్మ కళ్ళు చెమర్చినయ్. ఇంతవరకూ రాజు ఆమాట అంటాడా, అనడా అని పరిపరి విధాల తలపోస్తున్న రాజమ్మ ఊహలు, సౌధాలయినయ్. రాజమ్మ సంతోషం పట్టలేక మేడపైకి వెళ్ళింది, కూతురుతో చెప్పటానికి.

సరోజిని నిద్రపోతూవుంది. రాజమ్మ 'సరూ, సరూ!' అంటూ లేపింది. సరోజిని నిద్రకళ్ళతో లేచి 'ఏమిటే' అన్నది.

'నీకో మంచిమాట చెబుతాలే, లేమ్మా లే' అన్నది.

సరోజ నిద్రకళ్ళతో లేచింది.

రాజు మేడపైకి వస్తున్నాడు అప్పుడే. రాజమ్మ సరోజిని చెవులో ఏదో చెపుతోంది. సరోజిని కళ్ళల్లో నిద్రమత్తుపోయి, ఆకాంక్ష, ప్రేమ నిండుకుంది. మత్తుగా రాజువైపు తిరిగింది.

రాజు కొత్త పెండ్లికొడుకులాగా చూశాడు సరోజిని కళ్ళల్లోకి.

# ప్రేమ: పెళ్లి

(కొందరు పెద్దల అభిప్రాయాలు.)

ప్రేమాస్థానమే స్వర్గం!

ఏ విధంగానైనా సరే, ప్రేమించగలిగితే వారు దేవతా స్వరూపులే.

నిప్పుకు వేడి వెలుగులూ,-ప్రేమకు త్యాగధైర్యాలూ, నైజగుణాలు.

ప్రేమకి లొంగటం, ప్రపంచంలోని ఉన్నత సౌఖ్యాన్ని, అంది పుచ్చుకోవడమే!

సమాన ప్రేమతో రాపాడే హృదయాలు ఆరని ప్రణయాగ్నిని రగుల్కొల్పుతాయి.

పెళ్లి జేసుకోబోయేవారికి, సలహా-వద్దు!!

పెళ్లి చేసుకోనవాళ్లే ప్రేమికులు.

ప్రేమస్వచ్ఛంద విహంగము. మానవనిర్మితమైన (పెళ్లి అనే) ఉచ్చులలో బంధించబూనితే, భరించలేనంటుంది; ఎగసిపోవాలనే ప్రయత్నంలో రెక్కలు తటతట కొట్టుకుంటూ, (దొరికినదల్లా ముక్కుతో పొడిచి ముక్కలుజేస్తూ,) అలిసి, నిస్పృహతో చచ్చిపోతుంది.

ప్రేమ మాట ఆలోచించకుండా పెళ్లి చేసితే,-పెళ్లి మాట మరచి, ప్రేమ కలగడం సహజమే గాదూ?

భార్య గ్రుడ్డిదీ, భర్త చెవిటివాడూ అయితే వైవాహిక జీవితం చల్లగా సాగిపోతుంది.